క్లుప్తంగా

శ్రీ చక్ర ప్రతిష్ఠాపను విజయవంతం చేయాలి



సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామ శ్రీ మానసాదేవి ఆలయంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే శ్రీ చక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఆలయంలో మంగళవారం ఆల్ పార్టీల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన శ్రీ చక్రంను గుండ్లపల్లి నుంచి గునుకులకొండాపూర్, జంగపల్లి, హన్మజిపల్లె, మైలారం, గన్నేరువరం, మాదాపూర్, పారువెల్ల, వడ్లూరు గ్రామాల మీదుగా ఆలయం వరకు మహిళల కోలాటాల మధ్య శోభాయాత్ర, ఊరేగింపుగా ఆలయ వరకు తీసుకరావడం జరుగుతోందని తెలిపారు. ఆయా గ్రామాల్లోని మహిళలు, భక్తులు ఈ శోభాయాత్రలో పాల్గొని శ్రీ అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఆలయ గౌరవ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చైర్మన్ చంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు నాగసాయిశర్మ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి కృషి



సత్యనారాయణను సన్మానిస్తున్న సభ్యులు

గన్నేరువరం: యాదవులు సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రం గన్నేరువరంలో మంగళవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు సందవేని ప్రశాంత్ అధ్వర్యంలో నిర్వహించిన యాదవుల సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అంతకుముందు ఖాసీంపేట, మైలారం గ్రామాల్లోని శ్రీ మానసాదేవి, శ్రీ మల్లికార్జునస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల రవీందర్, మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ, మహిళ జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, జిల్లా ఉపాధ్యక్షురాలు వైజయంతి, మండల ఉపాధ్యక్షులు దుడ్డు నాగరాజు, మర్రి వెంకటమల్లు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జీల కుమార్‌యాదవ్, కార్యదర్శి గొడుగు రాజు, గ్రామశాఖ అధ్యక్షుడు మీసం రాముల్లు పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఆక్రమించి.. తప్పుడు కేసులు పెడుతున్నారు



మాట్లాడుతున్న సమ్మయ్య

జమ్మికుంట: కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా... నా భార్య 30 ఏళ్లుగా ఉంటున్న ఇంటిని కూల్చి తనపై పోలీసులు తప్పుడు కేసులు పెడుతూ మానసిక వేదనకు గురిచేస్తున్నారని, న్యాయం కోసం లోకాయుక్తను ఆశ్రయించినట్లు పట్టణానికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి బొడికల సమ్మయ్య ఆరోపించారు. మంగళవారం మాట్లాడుతూ గతంలో నాగంపేటకు చెందిన కొందరితో తనకు ఆర్థిక లావాదేవీల్లో వివాదాలున్నాయని, వారి తరఫున తనుగులకు చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త, తన అనుచరులతో గతేడాది ఫిబ్రవరి 25న దాడిచేయించి, హత్య చేసేందుకు పూనుకున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా అతనిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మిడిదొడ్డి సదానందం అనే వ్యక్తి తన భార్య ఇంటిని కూల్చివేస్తుండగా ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా పోలీసులు పట్టించుకోలేదని, వారిని అడ్డుకున్నందుకు తనపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపారని ఆరోపించారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో నిరాహార దీక్ష చేపడుతానన్నారు. సమావేశంలో వినయ్, చక్రి, రాజయ్య, మల్లయ్య, వంశీ పాల్గొన్నారు.

చట్ట ప్రకారమే కేసు

పట్టణంలోని బొడికల సమ్మయ్యపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. కోర్టుల్లో కేసు విచారణ నడుస్తుంది. సమ్మయ్యపై దాడి చేసిన విషయంపై మాకు ఫిర్యాదు అందలేదు.

ఎంపీడీవోకు ఫిర్యాదు

వీణవంక: మండలంలోని బొంతుపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న అక్రమాలపై ఎంపీడీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ ఉపసర్పంచ్ చదువు జితేందర్‌రెడ్డి తెలిపారు. జీపీలో పనిచేస్తున్న కారోబార్ డీజిల్ బిల్లులు, కూలీల హాజర్లు, ఇతర రికార్డులను ఫోర్జరీ చేసి దుర్వినియోగానికి పాల్పడ్డాడని, ఈ విషయంపై ఎంపీవో ప్రభాకర్‌కు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిపారు. విధుల నుంచి పక్కకు పెట్టిన కారోబార్‌ను విధులకు రాని సమయంలో జీతం ఇవ్వాలని పాలకవర్గం తీర్మానం చేసిందని పేర్కొన్నట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన కారోబార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

అన్నదాతలకు విద్యుత్ షాక్

- ఇంటి బిల్లుకు అనుసంధానం
- తంటాలు పడుతున్న రైతులు
- వ్యవసాయ మోటార్ల బిల్లులతో ఆందోళన
- అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని ఆవేదన

రామడుగు: ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ బిల్లులు వసూలు చేయడానికి వ్యవసాయ మోటారు నంబర్లు అనుసంధానం చేయడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంలా మారింది. రైతులకు ఎలాంటి సంబంధం లేని వ్యవసాయ మోటారు విద్యుత్ బిల్లులు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇంటి బిల్లుతో పాటుగా వ్యవసాయ మోటారు బిల్లు కలిపి ఇవ్వడంతో రైతులను షాక్ గురిచేస్తుంది. తమకు వ్యవసాయ మోటారు విద్యుత్ బిల్లుతో సంబంధంలేదని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఇంటి మీటర్ బిల్లు లింక్‌తో తంటాలు

విద్యుత్ ట్రాన్స్‌కో అధికారులు వ్యవసాయ మోటారు బిల్లులు వసూలు చేయడానికి ప్రత్యేకంగా ఇంటి మీటరు కనెక్షన్‌తో అన్‌లైన్ లింక్ చేయడంతో ఇంటి మీటరు బిల్లులో వ్యవసాయ మోటారుకు సంబంధించిన బిల్లు కూడా వస్తుంది. దీంతో రైతులు ఇంటి మీటరు బిల్లుతో పాటుగా వ్యవసాయ మోటారు బిల్లులు కూడా చెల్లిస్తేనే అధికారులు తీసుకోవడం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు నానా తంటాలు పడి బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

తన పేరు మీద లేకున్న బిల్లులు

ఇంటి మీటరు నంబరుపై వ్యవసాయ మోటారు బిల్లు కూడా అన్‌లైన్ లింక్ ద్వారా వస్తుండంతో అన్నదాతలకు కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. తనకు ఈ వ్యవసాయ కనెక్షన్ మీటరు నంబరు లేదని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్నవారు కరువయ్యారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు

ఈ విషయమై రైతులు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. తక్షణం వీటిని సరిచేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కాగా తప్పుడు బిల్లులు వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళితే ఇంటి మీటరుకు సంబంధించిన కనెక్షన్ తొలగించి ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు తమ పేరుపైన ఉన్న వ్యవసాయ మోటారు బిల్లులు మాత్రమే వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వచ్చిన విద్యుత్తు బిల్లు

తెలియని మోటార్ల బిల్లులు వచ్చినవి



తనకు ఎలాంటి సంబంధంలేని వ్యవసాయ మోటారు కనెక్షన్‌తో ఇంటి నంబరుపైన విద్యుత్ బిల్లు కలిపి రశీదు అందజేశారు. దీంతో తాము ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. బిల్లు చెల్లిస్తేనే ఇంటి కనెక్షన్ ఇస్తామని స్థానిక విద్యుత్తు సిబ్బంది హెచ్చరిస్తున్నారు. ఇంటి బిల్లు కడుతామని చెప్పినప్పటికీ పూర్తి బిల్లు చెల్లింపు చేస్తేనే తీసుకుంటామని ఇబ్బంది పెడుతున్నారు. దీనిపైన ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశాను. తక్షణం తమ సమస్యను అధికారులు పరిష్కారం చేయాలని కోరుతున్నా.

– మనోహర్‌రెడ్డి, కోరటపల్లి, రైతు

రైతులకు ఇలా చేయడం సరికాదు



తమ పేరున లేకున్నా వ్యవసాయ మోటారు బిల్లును రైతు ఇంటి మీటరుకు జమ చేసి పంపించడం సరికాదు. దీంతో రైతులు నానా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు తక్షణం జరిగిన తప్పులను సరిచేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

– వెన్న రాజమల్లయ్య, టీపీసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ రాష్ట్ర కన్వీనర్

దళితులపై కేసీఆర్‌ది కపట ప్రేమ

చొప్పదండి: దళిత బంధు అమలు చేయకుండా ఎన్నికలకు ముందు కేసీఆర్ కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాడని బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు గుడిపాక రాములు విమర్శించారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితబంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు, గిరిజన బంధు అంటూ మోసపూరిత ప్రకటనలతో హామీల అమలు చేయకుండానే కేసీఆర్ రాష్ట్రాన్ని రూ.లక్షల కోట్ల అప్పుల పాలు చేశాడని విమర్శించారు. చొప్పదండి నియోజకవర్గం నుంచి తాను బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు. దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు వడ్లూరి సుధాకర్, జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ళ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



చొప్పదండి/చిగురుమామిడి: అయిదు శాతం ఐఆర్ ప్రకటించడం ఉద్యోగ, ఉపాధ్యాయులను అవమానించడమేనని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు విమర్శించారు. కనీసం 20 శాతం ఐఆర్‌తో పాటు, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు చొప్పదండి, చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాలలో డెమోక్రటిక్ , పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులునల్లబ్యాడ్జీలను ధరించి జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పీఆర్సీ ఇస్తామని అయిదు శాతం ఐఆర్ ఇవ్వడం వంచన చేయడమేనన్నారు. ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని గ్రహించాలని, పీఆర్సీ ఏరియర్స్, డీఏ ఏరియర్స్ ఇవ్వాలని, జీతాలు 1వ తేదీనే ఇవ్వాలని కోరారు. ఈ నిరసనలో హెచ్ఎం జనగాం శ్రీనివాస్, టీపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యామ తిరుపతి, నెలవేణి రామస్వామి, ఆర్.మహేశ్, సీహెచ్ లక్ష్మి, శ్రీధర్, పల్లవి, క్రాంతి, సూర్య ప్రకాశ్, జయలక్ష్మి, పుష్పలత, సరిత, గోపి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ ఏసీపీ విచారణ



విచారణ జరుపుతున్న ఏసీపీ కరుణాకర్‌రావు

చిగురుమామిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న పూదరి రాజుపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు విచారణ నిర్వహించారు. కోహెడ మండలం తీగలకుంటపల్లికి చెందిన తిరుపతి తనను కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై మంగళవారం స్థానిక తహసీల్దార్ నరేందర్ సమక్షంలో ఆర్ఐ రాజుతో పాటు కార్యాలయంలో పనిచేస్తున్న తోటి ఉద్యోగులను కూడా విచారించారు. గత నెల 24న చిగురుమామిడి శివారులోని పాంబండ వద్ద అక్రమంగా టిప్పర్ల సాయంతో తిరుపతి అనే వ్యక్తి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తుండగా పలువురు ఫిర్యాదు మేరకు మట్టి తరలింపును ఆపేయాలని తహసీల్దార్ నరేందర్ ఆదేశాల మేరకు ఆర్ఐ రాజు మట్టిని తరలిస్తున్న టిప్పర్లను, జేసీబీని పట్టుకోని తహసీల్దార్‌కు అప్పగించగా, వాటిని సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను తిరుపతి జరిమానా చెల్లించి బయటకు తెచ్చుకున్నారు. మరుసటి రోజు తిరుపతి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ రాజును కాలర్ పట్టుకుని దూషించడంతో ఆయన తహసీల్దార్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తరువాత రోజు తిరుపతి తనను కులం పేరుతో దూషించాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆర్ఐ రాజును ఏసీపీ విచారించారు. ఆయన వెంట చిగురుమామిడి ఎస్సై సామల రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

త్వరలోనే భూసంబంధ సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

చిగురుమామిడి: ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి జిల్లాలోని చాలామంది రైతులు తమ పట్టా, ఇతర లావణి భూసమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని, కలెక్టర్ డాక్టర్ గోపి ప్రతిరోజూ వందల దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన చిగురుమామిడి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సంబంధ సమస్యలు చాలా ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. అలాగే కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ నరేందర్ ఇవ్వడంలేదని దీంతో భూముల రిజిస్ట్రేషన్లు, బ్యాంకుల పనులు ఆగిపోతున్నాయని పలువురు తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతో ఇక నుంచి కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు 15 రోజుల్లో కాకుండా వారం రోజుల లోపే ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే వారికి సకాలంలో పనులు చేసిపెట్టాలన్నారు. పలు రిజిస్టర్లను ఆర్డీవో పరిశీలించారు.

స్వామినాథన్ కమిషన్ సిపార్సులను అమలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట: స్వామినాథన్ కమిషన్ సిపార్సులను వెంటనే అమలు చేసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద లకింపూర్, కేరి ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్త బ్లాక్ డేలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లకింపూర్, కేరి ఘటనలో నలుగురు రైతులు, ఒక విలేకరి మరణానికి కారణమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు అశీష్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, రైతాంగానికి లిఖితపూర్వకంగా ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ నడిబొడ్డున చేసిన రైతాంగ పోరాటంలో చనిపోయిన 700 మంది రైతు కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. విత్తన చట్టం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని, దేశ వ్యాప్తంగా వ్యవసాయ రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు అందించాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలుచేయని పక్షంలో భవిష్యత్తులో రైతాంగాన్ని సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శీలం అశోక్, జిల్లా కోశాధికారి బాసిర సంపత్‌రావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు దండిగరి సతీష్, శ్రీకాంత్, కన్నం సదానందం, కిషోర్, రాజకుమారి, లింగారెడ్డి, సురేష్, సమ్మయ్య, రాజకొమురయ్య పాల్గొన్నారు.

బీసీ సంఘాలు ఏకతాటిపైకి రావాలి

మానకొండూర్: బీసీ సంఘాలు ఏకతాటిపైకి రావాలని తెలంగాణా బీసీ సంక్షేమ సంఘం మానకొండూర్ మండల అధ్యక్షులు ముక్కెర సతీష్‌కుమార్ సోమవారం అన్నారు.

బీఎస్పీ అభ్యర్థిగా శేఖర్

చొప్పదండి: బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థిగా నియోజకవర్గలలోని బోయిన్‌పల్లి మండలం దేశాయిపేటకు చెందిన కొంకటి శేఖర్ పేరును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది.

నియామకం

జమ్మికుంట: సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన గండి రంజిత్‌కుమార్ గౌడ్‌ను నియమిస్తూ సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామి గౌడ్ మంగళవారం నియమకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన మోకు దెబ్బ సంఘం నాయకులకు ఈ సందర్భంగా రంజిత్‌కుమార్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

కోడ్ అమల్లో ఉన్నా బీసీబంధు ఇస్తాం

- సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



బీసీబంధు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

శంకరపట్నం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న బీసీ బంధు కొనసాగుతుందని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని వంకాయగూడెం గ్రామంలో ఓ ఫంక్షన్ హాల్‌లో బీసీ బంధు లబ్ధిదారులకు చెక్కులను, యువతకు క్రీడా సామాగ్రి అందించారు. బీసీ బంధు, దళిత బంధు, మైనార్టీ బంద్ నిరంతరం ప్రక్రియ అని ప్రతినెల పథకాలు లబ్ధిదారులకు అందుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై మక్కువ చూపే క్రీడాకారులకు నైపుణ్యం పెంపొందించేందుకు క్రీడా సామాగ్రిని అందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అందరికీ బీసీ బంధు, దళిత బంధు రాలేదని కాంగ్రెస్ పార్టీ కుట్రపూరిత ప్రచారం చేయనున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరితంగా కాగితంపై నాలుగు అక్షరాలు రాసి సంక్షేమ పథకాలు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు కుట్రపూరిత ప్రచారం చేయనున్నారన్నారు. యువత, ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ముందుండాలని పిలుపునిచ్చారు. కులవృత్తులను ఆదుకునేందుకు బీసీబంధు అందిస్తున్నామన్నారు. అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో పవన్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజామనోహర్‌రావు, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో బషీరుద్దీన్, ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, వైస్‌ఎంపీపీ రమేశ్, సర్పంచ్ లత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం

తిమ్మాపూర్: మండలంలోని కొత్తపల్లి సాయిరాంనగర్‌లో ఫంక్షన్ హాల్‌లో మొదటి విడత గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పంపిణీ చేశారు. తర్వాత కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం క్రీడా ప్రాంగణాలకు సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఇనుకొండ జితేందర్ రెడ్డి,రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, జడ్పీ సీఈవో పవన్ కుమార్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ కిరణ్ పాల్గొన్నారు.

మొబైల్ షాపులో చోరీకి యత్నం



షెట్టర్ తాళం పగుల గొట్టిన దుండగులు

జమ్మికుంట: పట్టణంలో ఓ మొబైల్ షాపులో గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. షాపు యాజమాని టీఎస్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఖాదీ కాంప్లెక్స్‌లోని వెంకటేశ్వర్ మొబైల్ షాపు, ఇంటర్‌నెట్ సెంటర్ పక్కన గల కిరాణం షాపులను సోమవారం రాత్రి మూసి వేసుకొని ఇంటికి వెళ్లారు. మంగళవారం యాధావిధిగా షాపు నిర్వహణ కోసం వచ్చి షెట్టర్ తీస్తామని చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. షాపులో చోరీకి యత్నించినట్లు గుర్తించి పరిశీలించగా ఎలాంటి వస్తువులు చోరీ జరుగలేదని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా చోరీపై వివరాలు సేకరించినట్లు తెలిసింది. చోరీపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



ప్రారంభిస్తున్న సర్పంచ్ సంజీవరెడ్డి

శంకరపట్నం: మండలంలోని చింతలపల్లి గ్రామంలో దేశపాండే ఫౌండేషన్ కాకతీయ సాండ్ బాక్స్ వారి సహకారంతో 25 రోజుల మగ్గం శిక్షణ తరగతులను సర్పంచ్ పల్లె సంజీవరెడ్డి మంగళవారం ప్రారంభించారు. మహిళలు మగ్గం శిక్షణ పొంది జీవితంలో తమ కుటుంబానికి సహకారం అందించేందుకు ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని వివరించారు. ఫౌండేషన్ నిర్వాహకులు భాస్కర్ మాట్లాడుతూ అందరూ శిక్షణను వినియోగించుకొని వ్యాపార అభివృద్ధి, పురోగతి సాధించాలన్నారు. శిక్షణ ట్రైనర్ శ్వేత, పలు మహిళా సంఘాలు పాల్గొన్నారు.

అభివృద్ధి చూపించి ఓట్లడగాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం



పార్టీలో చేరిన వారితో మేడిపల్లి సత్యం

గంగాధర: నియోజకవర్గంలో రూ.1800 కోట్ల అభివృద్ధి చేశానని ప్రచారం చేసుకుంటున్న ఎమ్మెల్యే రవిశంకర్ తాను చేసిన అభివృద్ధి చూపించిన తరువాతే ఓట్లు అడగాలని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో దాదాపు ఐదు వందల మంది గ్రామస్తులు కాంగ్రెస్ నాయకుడు పడాల రాజన్న ఆధ్వర్యంలో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అబద్దపు ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. తన సొంత అభివృద్ధికి తప్ప ప్రజల సంక్షేమం పట్టించుకోని నయవంచకుడని తీవ్రస్థాయిలో విమర్శించాడు. తాను రెండుసార్లు ఓడిపోయినా ప్రజల వెంటే ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తున్నానన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు పురమల్ల మనోహర్, పడాల రాజన్న, కడారి మల్లేశం, బూర్గు గంగన్న, తాళ్ల శ్రీనివాస్, రాచమల్ల భాస్కర్, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, వీరేశం, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్ : పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద మంగళవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని లాకింపూర్, కేర్‌లో రైతులు శాంతియుతంగా నిరసనలు తెలుపుతుండగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడికారు నలుగురు రైతులను, ఒక విలేకరిని పొట్టన పెట్టుకున్నారని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే హోంశాఖ సహాయ మంత్రిని మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలన్నారు. రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, పంటల బీమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు గుండేటి వాసుదేవ్, జిల్లా నాయకులు కదిరి రమేశ్, కొంకటి చంద్రయ్య, లింగయ్య సుధాకర్, రమేశ్, చిరంజీవి, రవి, రాజు బాలకృష్ణ, మోర మహేశ్, రవి, పల్లపు ప్రశాంత్, దాట్ల రత్నాకర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి విద్యార్థుల చేయూత

హుజూరాబాద్ : పట్టణంలోని స్థానిక విజ్ఞాన నెక్స్‌జెన్ పాఠశాల విద్యార్థులు బాలల సంరక్షణ సంస్థకు తమవంతు సాయం చేసి దాతృత్వం చాటుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ మాట్లాడుతూ... పోచంపల్లి రాజయ్య ఫౌండర్‌గా ఉన్న మంథని డివిజన్ హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ, గోదావరిఖని సభ్యులైన రమణమ్మ, గాయత్రిని పాఠశాలకు పంపించగా, విజ్ఞాన్ నెక్స్‌జెన్ పాఠశాల యాజమాన్యం, పిల్లలు కలిసి రూ. 8,044ను వెల్ఫేర్ సొసైటీకి అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సత్కరించారు. సొసైటీ సభ్యులు పాఠశాల విద్యార్థులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.